ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో నాగం

పెద్ద జీతగాడిలా పనిచేస్తా

- కేసీఆర్ సర్కారుకు అండగా నిలవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, నవంబర్ 14 : ఈ సారి ఎన్ని కల్లో తనను ఆశీర్వదిస్తే పెద్ద జీతగాడిలా పని చేస్తానని వ్యవసాయ శాఖ మంత్రి, వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సాగునీళ్లు, ఉచిత కరెంట్, పంటకు పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తూ సేద్యాన్ని నిలబెట్టిన కేసీఆర్ సర్కార్‌కు అండగా నిలబడాలని కోరారు. సీఎం కేసీఆర్ తోనే ఇదంతా సాధ్యమైందని చెప్పారు. నాడు వలసలకు నిలయమైన పాలమూరు ప్రాంతానికి నేడు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు పని కోసం వచ్చే స్థాయికి చేరుకున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా చేతనైన సాయం చేసినట్టు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో మెట్ట ప్రాంతాలకు సాగు నీళ్లు అందించేందుకు 64 మినీ లిఫ్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

తెలుగుగూడెంలో రైతు కూలీలతో కలిసి కలుపు తీస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే

- ఆపద వస్తే అపద్భాందవుడిలా ఆదుకుంట : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, నవంబర్ 14 : పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్టేనని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కొత్త పింఛన్ రావాలంటే.. అప్పటికే పింఛన్ వస్తున్న వారు చనిపోతేనే అవకాశం ఉండేదని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పింఛన్‌ను క్రమంగా పెంచామని.. ఈ సారి అధికారంలోకి వస్తే క్రమంగా రూ. 5,016కు పెంచుతామని చెప్పారు. అనంతరం తెలుగుగూడెం వ్యవసాయ క్షేత్రంలో రైతులతో ముచ్చటించారు. కూలీలతో కలిసి పొలంలో కలుపు తీశారు. ఆ తరువాత మహబూబ్‌నగర్ రూరల్ మండలం జమిస్తాపూర్‌లో కాంగ్రెస్ నేతలు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దళిత యువకుడిపై బీజేపీ దాడి

- హామీ నెరవేర్చలేదని అడిగినందుకు
- ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలోనే దౌర్జన్యం
- మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ఘటన

రుక్మాపూర్‌లో దినేశ్‌పై బీజేపీ కార్యకర్తల దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

చేగుంట, నవంబర్ 14: మెదక్ జిల్లా చేగుంట మండలంలో బీజేపీ ప్రచారంలో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. ఎన్నికల ప్రచారంలో భాగంగా దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మంగళవారం చేగుంట మండలం రుక్మాపూర్‌కు వచ్చారు. రఘునందన్‌రావుతో మాట్లాడుతున్న సమయంలో.. దళిత యువకుడు కొలుపుల దినేశ్ గత ఉప ఎన్నికల్లో ఇప్పిస్తానన్న పట్టాలేవీ అని ప్రశ్నించాడు. పక్కనే ఉన్న బీజేపీ నాయకులు అతనిపై దాడి చేశారు. రుక్మాపూర్ సర్పంచ్ భర్త అంజిరెడ్డి మధ్యం తాగించి గొడవకు ఉసిగొలుపుతున్నాడని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. 'మేం మధ్యం తాగి వచ్చామా?' అని దినేశ్ నిలదీయగా.. ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది.

ఖమ్మం రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి ఆగిపోతుంది

కేసీఆర్ పాలనలోనే అద్భుత అభివృద్ధి • ఖమ్మం త్రీటౌన్ రోడ్‌షోలో మంత్రి పువ్వాడ

ఖమ్మం, నవంబర్ 14: సీఎం కేసీఆర్ పాలనలో ఖమ్మం త్రీటౌన్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని రవాణా శాఖ మంత్రి, ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి ఆగిపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఖమ్మం త్రీటౌన్‌లోని పలు డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వెన్నుపోటుదారుడని విమర్శించారు. తాను ఖమ్మం బిడ్డనని, మరోసారి గెలిపించాలని పువ్వాడ కోరారు. కాగా, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్ మంగళవారం ఆయన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు.

- బీఆర్ఎస్‌లోకి జూపల్లి ముఖ్య అనుచరుడు

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం జనుంపల్లికి చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ నేత జోగు నాగశేషయ్యతోపాటు 20 మంది నాయకులు మంగళవారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. – కోడేరు

నర్సాపూర్‌లో రాజీనామా పత్రాలను చూపిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్ బీజేపీకి బిగ్‌షాక్

- ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపితో పాటు పలువురి రాజీనామా
- ఈటల రాజేందర్ తీరుపై ధ్వజం

నర్సాపూర్, నవంబర్ 14 : మెదక్ జిల్లా నర్సాపూర్ బీజేపీకి బిగ్‌షాక్ తగిలింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్, 231 మంది శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, రెండు మండలాల అధ్యక్షులు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ తీరును నిరసిస్తూ రాజీనామా చేసినట్టు గోపీ మంగళవారం మీడియాకు వెల్లడించారు. నర్సాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా రెండుసార్లు పోటీ చేశానని గుర్తుచేశారు. రాష్ట్ర నాయకులు తమ స్వప్రయోజనాల కోసం సిద్ధాంతాలను పక్కన పెట్టి, టికెట్లు ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈటల రాజేందర్ సిద్ధాంతాలను పక్కన పెట్టి కులరాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు.

కష్టపడ్డ వారికి బీజేపీలో గుర్తింపులేదు

- ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గుజ్జుల

పెద్దపల్లి, నవంబర్14: బీజేపీలో నిబద్ధతతో కష్టపడ్డవారికి గుర్తింపు లేదని, సిద్ధాంతాలు తెలియని వారికే అధినాయకత్వం పెద్దపీట వేస్తున్నదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. అధిష్ఠానంపై అసంతృప్తితో ఉన్న బీజేపీ పెద్దపల్లి మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి గుజ్జుల రామకృష్ణారెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. సిద్ధాంతాల గురించి అవగాహనలేని వారికి టికెట్ ఇచ్చిందని మండిపడ్డారు. కొత్తగా చేరిన ఈటల రాజేందర్ లాంటి వారికి టికెట్ ఇచ్చి, పాత నాయకులను అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన వారు టికెట్ ఇస్తారా? లేదా? అని బ్లాక్ మెయిల్ చేస్తే పార్టీ బీ ఫాం ఇచ్చినట్టు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడి పనిచేసిన వారిలో 20 మందికి కూడా బీజేపీ టికెట్ ఇవ్వలేదని ఆరోపించారు. బీజేపీ నుంచి పెద్దపల్లి ఎమ్మెల్యేగా పని చేసిన తనకు సమాచారం లేకుండా మరొకరికి టికెట్ ఇచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర నాయకత్వం అనాలోచిత నిర్ణయాలతో పార్టీ నష్టపోతుందని హెచ్చరించారు.

తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే

- బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి శంకరన్న దొండ్లే

ఎదులాపురం, నవంబర్ 14: తెలంగాణలో మరోసారి ఎగిరేది గులాబీ జెండానేనని నాందేడ్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి శంకరన్న దొండ్లే స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన, జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మరాఠ్వాడ్ కోఆర్డినేటర్ దత్త పవార్‌తో కలిసి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో మహారాష్ట్రకు సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. గత పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ నిలిపారని కొనియాడారు. తెలంగాణ, మహారాష్ట్రతో పాటు దేశానికి కేసీఆర్ లాంటి నాయకుడు చాలా అవసరమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలు, ముఖ్యంగా రైతుల సంక్షేమ కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ఏకైక లీడర్ కేసీఆర్ అని ప్రశంసించారు. తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో మహారాష్ట్రలో కాంగ్రెస్, బీజేపీతోపాటు ప్రాంతీయ పార్టీల పాలన చూశానని, కానీ తెలంగాణలో అందుతున్న ప్రజారంజక పాలన ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, బీజేపీ, శివసేన పాలనతో ప్రజలు విసుగు చెందినట్టు చెప్పారు. కేసీఆర్ మహారాష్ట్ర రాజకీయాల్లోకి రావాలని తమ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదంతో మహారాష్ట్ర సరిహద్దుల్లో కొన్ని చోట్ల సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమావ్యక్తం చేశారు.

- న్యూయార్క్‌టైం స్క్వేర్ బిల్డింగ్ స్క్రీన్‌పై మెరిసిన సంద్ర

బీఆర్ఎస్ సత్తుపల్లి అభ్యర్థి సంద్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ అమెరికాలోని న్యూయార్క్ సిటీ టైం స్క్వేర్ బిల్డింగ్ స్క్రీన్‌పై ప్రవాస సత్తుపల్లి నియోజక వర్గవాసులు, సంద్ర అభిమానులు ఆయన చిత్రాన్ని ప్రదర్శించారు. – సత్తుపల్లి టౌన్